# ప్రేమ రోడ్డెక్కింది

"నేను నాగేసర్రావునే లవ్వాడినాను. కాదూ కూడదంటే సాకిరేవు సెర్లో పడి సస్తాను. నా బొందికి కల్లేణం సెయ్యండి" అని తెగేసి చెప్పేసి .... అంత వరకూ తలుపు కానుకునించున్న సీతాలు, విసురుగా వెనక్కి తిరిగి పాకలోంచి బయటి కెళ్ళిపోయింది.

సీతాలు అమ్మా, అయ్యా మొహమొహాలు చూసు కున్నారు. దిమ్మెర్రోయినట్టు కూచున్నారు. పొద్దు ట్నుంచీ కూతురికి నూరిపోసిందంతా గోదాట్లో కలిసి పోయింది. మేనత్త కొడుకుని చేసుకోటానికి సీతాలు ససేమిరా ఒప్పుకోలేదు.

చాకలెంకడికీ, రత్తమ్మకీ పిల్లలు పోగాపోగా — 'వొడ్డీకాసులోడి ధరమాన' సీతాలు పుట్టి బతికి బట్ట కట్టింది. చాకలి పనేవిటో ఎరక్కుండా పెరిగి ఈడొచ్చి విరబూసిన బంతిచెట్టులా తయారైంది. సీతాలు నిగ నిగలాడే నేరేడు పండు నలుపు. ఎత్తరి. చందమామ లంతేసి కళ్ళు, జెర్రి గొడ్డంత జడ. ఎప్పుడూ గంజిపెట్టి ఇస్త్రీ చేసిన తాబొందులే కడుతుంది. ఎప్పుడేనా ముచ్చటకి .... ఏ కరణంగారి కూతురిదో, మునసబు గారి కోడలిదో పెద్ద పెద్ద పూలచీర కట్టి... కాటుకెట్టి.... బొట్టెట్టి సింగారించుకుంటే.... 'అమ్మోరులాగ' మిడిసి పడిపోతుంది.

సీతాలు పుట్టేటప్పటికే — మేనత్త కొడుకు కొండయ్య ఆరేళ్ళ వాడు. సీతాలు కోసమే పెరుగు తున్నాడు. ఎంకడి అప్ప మంగమ్మ మొగుడు పోయిం తర్వాత మారు మనువుకెళ్ళక తోడబుట్టిన వాడి పంచ చేరింది. కొండయ్య తండ్రికి, రెండెకరాల వరి పండే పొలం వుంది. మంగమ్మ రెండో పెళ్ళి చేసుకుంటే మొగుడి పొలం మీద హక్కులన్నీ వదిలేసుకోవా లన్నారు తెలిసిన వాళ్ళు. అయినా ఎంకడు, చెల్లెలికి సంబంధాలు చూడాలని ప్రయత్నించాడు. మంగమ్మ వొప్పుకోలేదు. "మొగుళ్ళేకపోతే బతకొచ్చుగానీ.... ముద్ద లేకపోతే బతకలేం. ఏటి కేడాదీ రెక్కల కష్టం మీద జరగాలంటే లాభం లేదు" అనేసింది.

ఎంకడికి కూడా చెల్లెలి గుణం నచ్చి, "సెబాసు మంగీ! ఏల కిలవజేసే మాటన్నావే!" అని మెచ్చు కున్నాడు.

ఐదారు నెల్లపాటు వదినా మరదళ్ళిద్దరూ కలిసి మెలిసి ఒకే వంటతో బాగానే వున్నారు. తర్వాత్తర్వాతేవో ఎలకమీదా పిల్లిమీదా దెప్పుళ్ళు ప్రారంభమయ్యాయి.

"ఆడోళ్ళు కీసులాడుకుంటన్నార"ని గ్రహించి ఎంకడు చెల్లెలికోసం వేరే పాక వేసి.... తగూ తీర్చే శాడు.

వేర్లు పడ్డాక ఆడవాళ్ళకి అభిమానాలు పుట్టు కొచ్చాయి. సీతాలు పుట్టింతర్వాత తేకరాలింకా ఎక్కు వయ్యాయి. 'నా కోడలం'టే, 'నా అల్లుడ'ని — ముచ్చట్లతో, వేళాకోళాలతో కాలం గడుస్తోంది.

కొండయ్యకి సీతాలంటే ఎంతో ముద్దు. చిన్న ప్పుడు దాన్ని ఎత్తుకుమోసి, ఆడించి, నడిపించి, నవ్వించి, తెగ సంతోషించే వాడు. మంగమ్మ కొడు కుని చూసి నవ్వుతూ, "ఎందుకూ దాన్ని చూసుకుని అలా మురిసి ముక్కలౌతావు? పెళ్ళాన్ని బాగా తన్ని లొంగదీసి నీ సెప్పుచేతల్లో ఎట్టుకో" అనేది.

రత్తమ్మ ఊరుకునేది కాదు.

"అదే మొగుడి సెవులు మెలేస్తదిలే. ఏంటను కున్నావో!" అని కూతుర్ని తెగ పొగుడుకునేది.

ఎంకడు, చాకిరేవు లోంచి వచ్చి వాకిట్లో నులక మంచాని కడ్డంగా పడుకుని మధ్య మధ్య లేచి చుట్ట కాలుస్తూ, ఆడవాళ్ళ కబుర్లు సంబరంగా వింటూ వుండేవాడు.

అంత నిశ్చింతగా గడిచిపోయాయి పదహారేళ్ళు.

కొండయ్య మంచి పనివాడయ్యాడు. చాకిరేవూ, వ్యవసాయం రెండూ చక్కబెట్టుకుంటున్నాడు.

అందరిమధ్యా సీతాలికి అతిగారాబం. విడిచిన గుడ్డ మడతబెట్టదు. కష్టమంటే ఎరగదు. సీతాకోక చిలకలాగ, సినిమా బొమ్మలాగ, సింగారించుకుని, ఉతికిన బట్టలు ఇళ్ళకిచ్చే పని మాత్రం చేస్తుంది.

వాళ్ళమ్మ ఏ పూట కాపూట గిన్నెలో అన్నం పెడితేగానీ తిండికి కూచోదు.

"దానికేం మారాణి! రెండెకరాల పొలం వున్న మొగుడు" అని సాటి పిల్లలంతా సీతాల్ని చూసి ఉక్రోషంతో మూతులూ, ముక్కులూ, విరుచుకుంటూ వుంటారు.

సీతాలుకీ కొండయ్యకీ వైభవంగా పెళ్ళి చేసెయ్యాలని పెద్దవాళ్ళు ముగ్గురికీ ఆరాటంగా వుంది. ఆ పెళ్ళి కబుర్లు కొండయ్యకే కాదు, సీతాలుకి కూడా తియ్యటి కలలాగే ఉన్నాయి నిన్నమొన్నటిదాకా. నాగేసుర్రావు ఆ ఊరు వచ్చేదాకా.

ఐదార్నెల్ల క్రితం ఎక్కణ్ణించో కాపరం వచ్చాడా ఊరు నాగేసర్రావు. బెజవాడ నించొచ్చాడన్నారు కొంత మంది. కాకినాడ నించన్నారు కొంతమంది. మొత్తానికి బస్తీనించే వచ్చాడా పల్లెటూరికి. మనిషి నీరు కావి గుడ్డలాగ ఎర్రగా వుంటాడు. పొడుగు లాగులు తొడిగి బొమ్మల బుష్ కోట్లేస్తాడు. ఎప్పుడూ కాళ్ళకు రబ్బరు చెప్పులుంటాయి. సిగరెట్లు తెగ కాలుస్తాడు. చూడ్డానికి షోగ్గా సినిమా హీరోలాగ వుంటాడు.

నాగేసర్రావు వచ్చి.... ఊరుకి తూర్పు వేపున చిన్న పాకలో లాండ్రీ ప్రారంభించాడు. అక్కడే బోడెమ్మ హోటలూ .... సైకిలు షాపూ .... పేకాట పాకా .... ఉన్నాయి. మర్రి చెట్టుకింద రిక్షావాళ్ళూ అరటిపళ్ళ వాళ్ళూ అయిసు కుర్రాళ్ళూ అందరూ చేరతారు. పగలంతా అక్కడ సందడిగానే వుంటుంది.

తామరాకులు తేలే ఆ చెరువూ, దాని వొడ్డున పెద్ద మర్రిచెట్టూ తప్ప ఆ వూరికి అందాలేమీ లేవు. సౌకర్యాలూ లేవు. డబ్బు గల వాళ్ళంతా పేకాడుకుంటూ వుంటారు. లేకపోతే దగ్గిర తాడేపల్లి గూడెమో, ఏలూరో పోతారు. ఆ ఊరికీ, ఆ మనుషులకీ హుషారు కలిగించేది పేకాట తర్వాత, పంచాయితీ ఎలక్షనే. ఆ ఎలక్షన్లు అయిపోయింతర్వాత ఊరు చచ్చిపోతుంది. ఆ చావులోంచి కొంచెం ఊపిరి పోసేవి సినిమా కబుర్లు. ఆ ఊళ్ళో ఆడవాళ్ళూ, కుర్రకారూ సినిమాల మూలాన్నే బతికి వున్నారు. రాత్రీ పగలూ, ఇంటా బయటా, ఎప్పుడూ సినిమా కబుర్లే చెప్పుకుంటూ వుంటారు.

నాగేసర్రావు ఆ ఊరొచ్చిన నాలుగైదు రోజులకి "మీ ఊరిలాగుదేంటీ?" అన్నాడు.

"ఇంకెలా గుండాలి?" అన్నారు కొందరు కుర్రాళ్ళు.

"ఎలా గుండాలా? ఫస్టుక్లాసుగా ఉండాలి. కంకరోడ్లుండాలి. ఆసుపత్రులుండాలి. ఇస్కూలుండాలి. లయిబ్రీ వుండాలి...."

"ఓ యబ్బో! అయ్యన్నీ గవర్నమెంటోడు సెయ్యాల!"

"గవర్నమెంటోడెవడు? మనవేఁ."

"మనవా? హోర్నీ! బలేగున్నావే."

"మీ ప్రెసిడెంటుగారేం చేస్తాడు?"

"రోజూ రిష్కా ఎక్కి తాడేపల్లి గూడెం ఎల్తాడు. ఆయన కెన్ని యాతన్లు. ఇంకేం సెయ్యగల్డు?"

"పోనీ అయ్యన్నీ లేకపోయినా ఫర్వాలేదుగానీ ఊళ్ళ సినిమా హాలన్నా ఉండొద్దా? అది లేకపోతే ఇంక అదేం ఊరు? .... అందరూ డబ్బుగలోళ్ళే కదా? రెండే సెకరాలమ్మేసి ఒక సినిమా హాలన్నా కడితే ఎంత బాగుంటది!" అన్నాడు నాగేసర్రావు.

వినేవాళ్ళు నాగేసర్రావు సలహాకి చాలా సంతోషించారు. ఆ కబురు ఊళ్ళో సగం మందికి చెప్పారు.

"ఎంతైనా బస్తీవోడు. ఆడికన్నీ తెలుస్తయ్యి" అని అతన్ని తెగమెచ్చుకున్నారు కొంతమంది కుర్రకారు.

బస్తీలో లాగానే ఆ ఊళ్ళో లాండ్రీకి పని బాగానే వస్తోంది. అర్జంటుగా నిముషాలమీద.... చీరెలూ.... పంచెలూ.... చొక్కాలూ.... అన్నీ ఇస్త్రీ చేసేసి ఇచ్చేస్తాడు నాగేసర్రావు. వారం రోజులకే గొప్ప పేరు వచ్చేసింది, అతనికి ఊళ్ళో! — అతను ఇస్త్రీ చేస్తే నూలు గుడ్డయినా సిల్కులా మెరిసిపోతుందనీ, నెల రోజులదాకా నలగదనీ, పాత గుడ్డ సరికొత్తదానిలా తయారౌతుందనీ!.... ఊళ్ళో సగంమంది నాగేసర్రావు లాండ్రీకే ఎగబడటం మొదలుపెట్టారు.

నాగేసర్రావుకి తల్లి తప్ప చేతికి సాయం ఎవ్వరూ లేరు. ఆ తల్లి కూడా చాలా పెద్దది. కష్టపళ్ళేదు. ఇస్త్రీ పెట్టెలో బొగ్గులు పోసి ఎర్రగా కాల్చి ఇస్తుంది. కూడూ కూరా వొండుతుంది. ఇస్త్రీ చేసిన బట్టలు ఇళ్ళకిచ్చి డబ్బులు తీసుకొస్తుంది. అంతేగానీ చాకిరేవు పని చెయ్యలేదు. లాండ్రీకొచ్చే గుడ్డలు ఉతకటానికొక మనిషి కోసం వాకబు చేశాడు నాగేసర్రావు. ఎవరో

ఎంకణ్ణి అడగమన్నారు. అడిగాడు నాగేసర్రావు. పని కొప్పుకున్నాడు ఎంకడు.

రోజూ సాయంత్రం వేళ ఎంకడే చాకిరేవులోంచి తిన్నగా లాండ్రీకి పోయి బట్టలప్పజెప్పి వచ్చేవాడు. ఒకనాడేదో పొలం పనిమీద పోయారు కొండయ్యా ఎంకడూ బట్టలింట్లో పడేసి.

"వాలే సీతా! నా తల్లి.... ఈ వొక్కపూటకీ బట్ట లిచ్చి రాయే అమ్మా!" అని కూతుర్ని బతిమాలింది రత్తమ్మ.

"మరే! నేనెందుకెళ్తానూ? కావాలంటె నువ్వెల్లు. లేకపోతే అత్తనెల్లమను" అని మొండికేసింది సీతాలు.

"నా తల్లివి కదూ?.... ఇంకెప్పుడూ ఎల్లొద్దులే, పాపం .... నాగేసర్రావు గుడ్డలకోసం సూస్తావుంటాడే" అంది రత్తమ్మ.

సీతాలు మనసులో మెరుపు మెరిసింది — "సరే! ఎల్తాన్లే" అంది నవ్వు మొహంతో.

సీతాలు నాగేసర్రావుని చాలాసార్లు చూసింది. అతని అందానికి .... నాజూకుతనానికి .... మురిసి పోయింది. "ఇంత అందమైనోళ్ళు సినిమాల్లో అన్నా వుంటారా?" అని తెల్లబోయింది. ఎలాగైనా నాగేస ర్రావుతో మాట్లాడాలని చాలాసార్లు ఉబలాటపడింది. ఎప్పుడూ సమయం కుదరలేదు.

"ఇంకా నిలబడ్డా వెందుకొలే!" అని వాళ్ళమ్మ బట్టలమూట అందించబోతే — "ఛీ! ఇలాగేనా? మొగానికి పౌగ్రన్నా రాసుకోనీ" అంటూ గబగబా మొహం కడుక్కొచ్చి, రోజుకన్నా ఎక్కువ పౌడరు రాసుకుని, వేలెడెడల్పున కాటుక పెట్టుకుని, బొట్టు దిద్దుకుని, ఇస్త్రీ తాబొందు కట్టుకుని, సిల్కుపైట సెల్లా వేసుకుని, ముద్ద మందారపూలు గుత్తికట్టి తల్లో దోపుకుని .... అద్దంలో మొహంపెట్టి అందం చూసు కుంటూ కూచుంది.

"మొగుడికాడి కెల్తన్నట్టు ఏంటే నీ సింగారం?" అని మంగమ్మ కోడలి బుగ్గమీదో పోటుపొడిస్తే సీతాలు అద్దంలోంచి బయటపడింది. "సాల్లే అత్తా! నీకెప్పుడూ ఆ వూసులే!" అని మూతి తిప్పుకుని బట్టల మూట సొగసుగా చంకన పెట్టుకుని బయల్దేరింది. నడుస్తూ వుంటే సీతాలుకేవిటో గాభరాగా అయింది. నాగేసర్రావు దగ్గిరి కెళ్తున్నాననుకుంటే గుండెల్లో ఎందుకో గుబులుగా అయింది. అసలు నాగేస ర్రావుతో ఎల్లాగ మాటాట్టం? బస్తీవోడు. యావంటాడో! ఏం తప్పడతాడో! నన్ను చూసి అందవైందే అను కుంటాడేవో! — చచ్చే సిగ్గు ముంచుకొచ్చింది. పరి గెట్టి వెనక్కెళ్ళిపోదామా అనుకుంది. మనసు ముందుకే లాక్కెళ్ళింది. పెళ్ళి నడక నడుస్తూ, నేలచూపులు చూస్తూ లాండ్రీ పాకముందుకెళ్ళి నించుంది.

నాగేసర్రావు సిగరెట్టు కాలుస్తూ అప్పుడే పాక లోంచి బయటికి రాబోయి గుమ్మంలో ఆగిపోయాడు. తెల్లటి లుంగీమీద కంపెనీ బనీను వేసుకున్నాడు. ఆ ఒక్క చూపుకే తళుక్కుమన్నట్టు ఎంతో షోగ్గా కన బడ్డాడు.

సీతాలు సిగ్గుపడి తల వొంచేసుకుంది.

"ఇస్త్రీ చెయ్యాలా? ఎప్పుడు గావాలి?" అన్నాడు నాగేసర్రావు పలకరిస్తూ.

సీతాలు, తల కొంచెం పైకెత్తి, "ఊహూ! గుడ్డలు తెచ్చాను" అంది ఎలాగో నోరు పెగుల్చుకుని.

"ఉతుకు గుడ్డలా?" అన్నాడు మళ్ళీ.

సీతాలు పూర్తిగా తలెత్తి కొంచెం కళ్ళు వాల్చుకుని — "ఎంకడి కూతుర్ని. మా బాబు పొలం కాడున్నాడని, మా అమ్మ నన్నట్టుకెల్లమంది గుడ్డలు" అంది ధైర్యంగా.

"నువ్వా.... చెప్పవేం? లోపలికి రా! అమ్మా! ఈ పిల్లొచ్చింది చూడు" అని గట్టిగా కేకపెట్టి, సీతాలు తెచ్చిన గుడ్డలన్నీ లెక్క చూసుకున్నాడు నాగేసర్రావు.

లాండ్రీ పాక తాటాకుల్దే అయినా లోపలికెళ్ళి చూస్తే మతి పోయింది సీతాలుకి. పెద్ద బల్లమీద ఇస్త్రీ పెట్టి వుంది. దాని దగ్గర బోలెడు గుడ్డలున్నాయి. చిన్న బీరువాల్లో ఇస్త్రీ చేసిన బట్టలన్నీ ముద్దొచ్చేలాగ సర్దు కున్నాడు నాగేసర్రావు. వచ్చే వాళ్ళు కూచోటానికో బెంచీ వుంది. ఒక మేదర కుర్చీ కూడా వుంది. ఇక అలికిన గోడల్నిండా ఎన్ని బొమ్మలో! సీతాలు ఆశ్చర్య పడుతూ ఫోటోల్ని కళ్ళతో చదవటం మొదలుపెట్టింది. సావిత్రీ, జెమునా, నాగేసర్రావూ, సూరేకాంతం, నాగేస ర్రావూ, నాగేసర్రావూ, ఏడుకొండల దేవుడూ ఇజై లలితా, నాగేసర్రావూ, వాయ్‌జయంతీమాల, అంజ నేయులు వారూ, సచ్యసాయిబాబా, రేలంగీ, నాగేస ర్రావూ, పద్మనాబం, నాగేసర్రావూ, అబ్బ! ఎన్ని

పాటోవులో! చుట్టూ నాలుగ్గోడలూ కలియచూసి తెగ ఆశ్చర్యపోయి — "ఎమ్టీ వోడి బొమ్మల్లేవేం?" అంది సిగ్గుపడుతూనే.

సీతాల్ని ఎగాదిగా చూస్తూ నించున్న నాగేసర్రావు అదోలా నవ్వి, "నాకు నాగేసర్రావిష్టం" అన్నాడు.

"ఏం ఏమ్టీ రామారావంటే ఎందుకిష్టంలేదు?" అంది సీతాలు సిగ్గుమర్చిపోయి ఆశ్చర్యంగా చూస్తూ.

నాగేసర్రావు మళ్ళీ నవ్వి — "ఇష్టం లేదని నేనన్నానా?" అన్నాడు.

"మరి ఆడిబొమ్మ లెట్టలేదేం?"

"అది నా ఇష్టం" నవ్వాడు.

సీతాలుకి ఉక్రోషం వచ్చింది. "నీకిష్టం లేకపోతే ఎమ్టీవోడికేం నష్టంలేదు" అంది విసురుగా.

నాగేసర్రావు మళ్ళీ నవ్వాడు. ఇంకో సిగరెట్టు వెలిగించాడు — "కూచో, నించున్నావేం?" అన్నాడు.

"ఊహూ! మా అమ్మ తిడద్ది, ఎల్తాను" అంది కదలకుండా.

"ఎళ్దుగానిలే! కూచో. నువ్వు సినిమాలన్నీ చూస్తావా?" అన్నాడు ఎంతో చనువుగా. అది చనువు కాదు, ఇంకా ఏవిటోలాగ అడిగినట్టుంది సీతాలికి. నాగేసర్రావులాగే చక్కగా మాట్లాడాలని, "సూస్తాను, మా బావకైతే మరీ ఇది. ఒక్కో సినిమా నాలుగేసిసార్లు సూస్తాడు" అంది కళ్ళు మెరిపిస్తూ.

నాగేసర్రావు కొంచెంసేపు వూరుకుని అన్నాడు — "మీకు సరిగ్గా తెలవదు. మీది విలేజి గ్రామం. టౌనులో వోళ్ళంతా... నాగేసర్రావంటేనే పడిసస్తారు."

సీతాలు చాలా ఆశ్చర్యపోయింది — "ఎందుకలాగ పడిసావటం? ఎమ్టీవోడే బాగా సేస్తాడేస్టంటూ."

"అసలు వేక్షనంటే అది కాదు. మొకంలో చూపించాలి. కళ్ళల్లో చూపించాలి. అసలు నాగేసర్రావు మొకవేం ఏరు."

సీతాలుకి సర్రున కోపం వచ్చింది. "ఏరేలే! ఏరు కాకపోతే ఇద్దరికీ ఒకటే మొహం వుంటదా?" అంది వెటకారంగా.

"అబ్బే! అది కాదు. అసలు నాగేసర్రావు...."

"ఏంటే పిల్లా నువొచ్చినావు?" అంటూ సుబ్బమ్మ పెరట్లోంచి పాకలోకొచ్చింది. "మీ అమ్మకేంటో వొంట్లో బాగోలేదంట?" అని పలకరించింది.

"ఉప్పుడు బాగానే వుంది" అంది సీతాలు నాగేసర్రావు వేపే చూస్తూ.

నాగేసర్రావు గోడకి తగిలించుకున్న అద్దంలో తల నున్నగా దువ్వుకుని కొంచెం చెరుపుకున్నాడు. ఇస్త్రీ బట్టల్లోంచి టెర్లిన్ చొక్కాతీసి వేసుకున్నాడు. అప్పుడు నాగేసర్రావుని చూడటానికి సీతాలుకి రెండు కళ్ళూ చాలలేదు. "ఎంత బాగున్నాడు! ఎంతందంగున్నాడు!" అనుకుంటూ మైమరిచి చూస్తూ ఉండిపోయింది.

నాగేసర్రావు చటుక్కున వెనక్కి తిరిగి నవ్వుతూ "నీ పేరేంటో చెప్పలేదేం?" అన్నాడు.

దొరికిపోయిన దొంగలాగ సీతాలు సిగ్గుపడిపోయింది. నాగేసర్రావే మడిగాడో సరిగ్గా విననే లేదు. ఇంకా కాస్సేపలాగ చూస్తూ వుంటే .... తను వెళ్ళి నాగేసర్రావు చేతుల్లో పడిపోతానేమోనని జంకు పుట్టింది. "ఎల్లాలి. ఇంటికాడ పనుంది" అని కంగారు పడుతూ లేచి నుంచుంది.

"కూకో పిల్లా! ఎల్దుగాలే" అంది సుబ్బమ్మ.

సీతాలు వినిపించుకోలేదు. గుమ్మంలో నించున్న నాగేసర్రావుని తప్పుకోమన్నట్టు కొంచెం నవ్వుతూ చూసింది.

"నీ పేరేంటంటే చెప్పవేం?" అన్నాడు నాగేసర్రావు తప్పుకోకుండా.

సీతాలు సిగ్గుపడుతూ — "సీతాలక్ష్మి, సీతాలంటారు మావోళ్ళంతా" అంది తలకొంచెం వొంచుకుంటూ.

"రోజూ గుడ్డలు నువ్వే తేరాదూ?"

"మా అయ్య తెస్తన్నాడుగా?"

"అవున్లే, పోనీమళ్ళా ఎప్పుడన్నా రా! పెట్లో ఇంకా శానా బొమ్మలున్నాయి. చూద్దుగాని," అన్నాడు నాగేసర్రావు, సీతాల్ని కళ్ళతో తింటూ.

"ఏమో బాబూ! మా అమ్మ తిడద్ది" అంటూ వోరకంట చూసి, నాగేసర్రావు కొంచెం తప్పుకోగానే గుమ్మంలోంచి బయటపడి, గజ్జెల గుర్రంలా, మువ్వల పాంజా పట్టాలు గలగల్లాడించుకుంటూ పరిగెత్తింది సీతాలు.

"సావిత్తిర్లాగుంది" అనుకున్నాడు నాగేసర్రావు అటేచూస్తూ.

సీతాలు ఇంటికెళ్ళేసరికి, వాళ్ళమ్మ పొయ్యికింద కందికంప మంటపెడుతూ కూడొండుతోంది. వాళ్ళత్త దీపం బుడ్డి ముందు తల విరబోసుకుని పేలు దువ్వు కుంటోంది. బాబు వాకిట్లో కూచుని చుట్ట కాలుస్తు న్నాడు.

సీతాలు రాగానే, "ఏంటే ఇంతా లీసం?" అంది వాళ్ళమ్మ.

"బాగుందిలే, ఎల్లి రావాలా? దాని గుణం కుదర మట్టి ఆ గుడ్డలన్నా పట్టుకెళ్ళింది" అన్నాడు బాబు కూతుర్నీ గారాబంగా చూస్తూ.

"బావయ్యింకా రాలేదా?" అంటూ అలసిపోయి నులకమంచం పట్టి మీద మొహం పెట్టి పడుకుంది సీతాలు.

"ఏంటే, ఆడు గ్నేపకం వొచ్చాడు నీకు?" అంటూ ఉత్సాహంగా, పేలు వేటాడుతూ, సరసమాడింది మేనత్త.

మాటలోనే కొండయ్య వచ్చాడు పొలంనించి. చేతిలో తట్టాబుట్టా గోడవార్న పారేసి.... పొంతకుండ పట్టుకుపోయి నీళ్ళు పోసుకుని వాళ్ళ పాకలో కెళ్ళి గిన్నెనిండా అన్నం పెట్టుకున్నాడు.

సీతాలు మంచం మీంచి లేచి అటు పరిగెత్తింది.

"కూడు తినేశా వేంటే?" అన్నాడు.

"ఇంకా లేదు. ఎందుకేంటి? ముద్దలెడతావా?"

"తింటే ఎందుకెట్టనూ?"

"ఆఁ పెట్టావులే. ఎంత తిన్నా నీ పొట్టకే సాల్దు"

"అలా గంటావనే పిలిచాను. మీ అత్తగారు రొయ్యల పులుసెట్టింది పట్టుకెల్లే" అంటూ మట్టి చిప్పలో పులుసుపోసి ఇచ్చాడు.

"అవును గానీ బావయ్యా! నీకోమాట చెప్పాల"

"ఏంటది?"

"కడుపు మండిపోతంది. ఆనక సెప్తాలే" అని సీతాలు పులుసు పట్టుకుపోయి వాళ్ళమ్మ వొండి వార్చిన అన్నం వేడివేడిగా పెట్టుకుని తిని వాకిట్లో కొచ్చింది.

అప్పటికే ఇరుగు పొరుగు కుర్రవాళ్ళంతా ఎంకడి వాకిట్లో చేరారు.

కొండయ్య చుట్ట కాలుస్తోంటే, సీతాలు దగ్గిరికెళ్ళి కూర్చుంది. "సందేల లాండ్రీకి గుడ్డలట్టుకెల్లానా! ఆడింటినిండా పొటోలే! అన్నీ సినిమావోళ్ల బొమ్మలే. ఎమ్టి రామారావంటే ఆడికిష్టం లేదంట. ఎమ్టి వోడి కసలు వేక్సనే రాదంట" అంది చాడీలు చెప్పినట్టు.

"ఎవడన్నాడే?" అని ఉరిమి చూశాడు కొండయ్య.

"లాండ్రీ నాగేసర్రావేనా? అవును. ఆడలాగే అంటాడు. నాతో కూడా అలాగే అన్నాడొకసారి" అన్నాడు రాముడు.

కొండయ్యకి చెప్పలేనంత కోపం వచ్చింది. "ఏడిశాడు. ఎదవ నాయాల. ఆడికేం తెల్సు, ఎమ్టీవోడి యిది?"

రావలసిన వాళ్ళంతా వచ్చారు — "ఏంట్రా? ఎవరూసు?" అంటూ చుట్టూ మూగారు.

కొండయ్య వినిపించుకోలేదు. "ఎయ్యి జన్మ లెత్తితే మాత్రం ఎమ్టీ రామారావు మొకం నాగేసర్రావు కొస్తదా?" అని మండిపడ్డాడు సీతాలు మీద.

"నన్నంటావేంటి బావయ్యా? మొగోడివైతే, ఎల్లి ఆణ్ణడుగు. ఎమ్టీ రామారావు కసలు వేక్సనే రాదంట!" అంది సీతాలు మళ్ళీ, ఆ మాట అన్నవాణ్ణి ఇప్పుడేం చేస్తావో చెయ్యమన్నట్టు.

కొండయ్య ఉగ్రుడయ్యాడు — "ఏదీ పద! ఆ కూత నాకాడ కుయ్యమను, దవడ పల్లు రాలగొడ తానో లేదో సూద్దుగాని. బస్తీ టక్కులేస్తన్నాడు గావాల. ఎంటీవోడి వుసారూ, స్టంటూ నాగేసర్రావు కొస్తయ్యా! ఆడెంత సేపూ బోరుమని యాడవటానికి పని కొత్తాడు" అని కేకలేశాడు.

కొండయ్య మాటలు వినీ వినగానే రంగడు సర్రున లేచాడు — "ఏంట్రా పేల్తన్నావ్? డోసెక్కు వయ్యిందేంటి? ఎంటీవోణ్ణి ఎనకేసుకొత్తే రాగానీ, నాగేసర్రావు నాడిపోసుకుంటా వెందుకూ? ఆడి కాలి గోరుకి పోల్తాడా నీ ఎంటీవోడు? నాగేసర్రావు కారెక్కి నాడంటే నా రాజా, సీవఁదొర్లాగుంటాడు."

"ఎంటీవోడు గుర్ర వెక్కినాడంటే, ఆడి తాతలా గుంటాడు."

"ఎల్లెల్లెహె! నీ ఎంటీవోడి వూసు నాకాడ తీసెయ్! అసలు నాగేసర్రావు అందవేఁయేరు."

"ఎంటీవోడి సోకే యేరు."

మస్తుగా తాగి పడుకున్న ఎంకడికి చిర్రెత్తు

కొచ్చింది. "ఏంటెహె జులాయెదవల్లాలా! ఎవుడెలా పోతే మీకెందుకెహె? ఎవడన్నా డబ్బులుచ్చుకోకుండా సినేమాలు సూపిత్తాడాంట? బుద్ధిలే నెదవల్లాలా? తొంగోండెహె!" అని కేక లేశాడు.

కుర్రాళ్ళు కొంచెం జంకి కంఠాలు తగ్గించారు.

"కుర్ర సన్నాసులేదో వూసులాడుకుంటంటే ఆల్ల జోలి నీకెందుకంట!" అని ఎంకడి పెళ్ళాం మొగుడి మీద అరిచింది. అతడు కిక్కురుమనకుండా పడు కున్నాడు.

కుర్రసన్నాసులకు హుషారెక్కువైంది. కంఠాలు లేచాయి మళ్ళీ.

ఆర్నెల్ల క్రితం రెండొందలు పట్టుకుని సినిమాల్లో చేరాలని మెడ్రాస్ పారిపోయిన వెంకటేశు, అంతకు ముందు కొన్ని వందలసార్లు చెప్పిన కబుర్లు మళ్ళీ కొత్త ఉత్సాహంతో చెప్పుకొస్తున్నాడు.

"సినిమా వోల్లందర్నీ సూసేశా. మెడ్రాసులో అల్లంతా కార్లేసుకుని తెగ తిరుగుతారెహె! నాగేసర్రావు మెడ్రాసులో లేడు. బొంబాయిలో వుంటన్నాడు. ఎంటీ రామారావింటికి ఎవలెల్లినా కుర్చీలో కూకోమని ... టియ్యిత్తాడు. నాగేసర్రావు మా కటికోడు. పిల్లికి బిచ్చం పెట్టడు."

"అదుగో! నాగేసర్రా వూసెత్తకు."

"నువేంటెహె! నా కల్లారా సూశానా, మరేంట న్నానా? ఒక మాటు నాగేసర్రావు రోడ్డుమీద నించుంటే దణ్ణం వెట్టాను దగ్గిరికెల్లి. సూడనట్టు మొకం తిప్పేసు కున్నాడు. పొగరుమోతోడు, ఏంటనుకున్నావో?"

"మరి నీ ఎన్టీవోడో?"

"నావోడో, నీవోడో నాకు తెలవదు. సెప్తా ఇను. ఎంటీ రామారావు సయ్యిన కార్లో దూసుకుపోతంటే ఆడికీ దణ్ణం వెట్టాను ..... టక్కున కారాపేసి .... నన్ను కేకేసి సెయ్యట్టుకుని కార్లో ఎక్కించుకుని...."

"ఎల్లెల్రా! కోతల్రోజు లెల్లిపోయాయి" అని తారా జువ్వలా లేచాడు రంగడు.

"ఆడు మెడ్రాసు సూసినోడు. ఆడు సెప్పేది ఇనేహె!" అన్నాడొకడు, రంగడి చెయ్యిపట్టుకుని లాగుతూ.

"ఏడిశాడు. ఈడే యేలూరు సూసి ఎనక్కొచ్చాడో! అబద్ధాల కోరెదవ."

"మాటలు తిన్నగా రానీ, రొండొందలట్టుకురా! మెడ్రాసూ బొంబాయీ అన్నీ తిప్పుతానో లేదో...." తనూ లేచి నించున్నాడు వెంకటేశు.

"అద్దరేత్రయింది. ఇంకెళ్ళి తొంగోండ్రా! మళ్ళీ సీకట్నేలెగాల" అని కేకలేసింది రత్తమ్మ.

మారు మాట్లాడకుండా ఎవరిళ్ళకి వాళ్ళు లేచి పోయారు.

సీతాలు, వాళ్ళమ్మ సరసన పడుకుంది. అమ్మా అయ్యా గురకలు పెడుతోన్నా సీతాలికి నిద్దర రాలేదు. అసలు నాగేసర్రావు గొప్పోడో, ఎన్టీ రామారావు గొప్పోడో తేలటం లేదు. అది తేలిపోతే, లాండ్రీ నాగేస ర్రావు గొప్పోడో కొండయ్య బావ గొప్పోడో తేలిపోద్ది" అనుకుంది. తొలికోడి కూసేదాకా సీతాలు ఆలోచ నలు తెమల్లేదు. తెలతెల వారుతోంటే నిద్రకి పడింది.

★ ★ ★

"నువ్వు సావిత్త్రిర్లా గుంటావు, తెలుసా?" అన్నాడు చాలాసార్లు నాగేసర్రావు సీతాలుతో. ఆ మాట విన్నప్పుడల్లా సీతాలెంత మురిసిపోతుందంటే, ఆ పళాన ఆణ్ణి కావిటేసుకుని ముద్దెట్టుకుంటేనా" అను కుంటుంది.

అసలు నాగేసర్రావేం చెప్పినా సీతాలికి ఆశ్చర్యం గానే వుంటుంది. తన సందేహాలన్నీ సిగ్గుపడుతూ అడుగుతుంది. "సినిమా వోళ్ళయినా, ఇంకెవళ్ళయినా మొగుడూ పెళ్ళాలు బతికి వుండగానే రెండో పెళ్ళా డొచ్చునా?" అంది ఒకసారి.

నాగేసర్రావు నవ్వి — "లవ్వాడితే తప్పు లేదు" అన్నాడు.

"అసలు సినిమా వోళ్ళు ఒక్కసారే కదా గట్టిగా లవ్వాడుకుంటారు?"

"అది సినిమాల్లో. అందుకే డబ్బుచ్చుకుంటారు."

"అయితే ఎన్నిసార్లయినా లవ్వాడొచ్చునా?"

నాగేసర్రావు కొంచెం విసుక్కుని "నీకేం తెలవదే పిల్లా! పల్లెటూరు గొడ్డువి. లవ్వాట్టం మన చేతుల్లో వుందా? దాని కదే పుడతది. కొత్త మనిషి మీద లవ్వు పుట్టినప్పుడు పాత మనిషి మీద లవ్వుపోదా? దాని కెవరేం చేస్తారు?" అన్నాడు.

సీతాలుకి కొంచెం ఎబ్బెట్టుగానే అనిపించింది,

అయినా, 'నాగేసర్రావు సెప్పాడు. అది నిజవేఁవో! అలాగే వుంటదేవో!' అనిపించింది.

"అయితే...." బెదురుతూ మొహం ఎత్తి నాగేసర్రావు కళ్ళల్లోకి చూసింది. "నువ్వయితే అల్లాగే సేస్తావా?"

నాగేసర్రావు కొంటిగా చూశాడు. సీతాల్ని కావలించుకో బోయినంత దగ్గరికొచ్చి, "నీలాంటి పెళ్ళాం వుంటే ఎందుకలా చేస్తాను?" అన్నాడు.

తుళ్ళిపడింది సీతాలు. సిగ్గుపడిపోయింది.

నాగేసర్రావు సీతాల్ని అమాంతం కావలించుకుని ముద్దుపెట్టేసుకున్నాడు. హడిలిపోయి సీతాలు బయటికి పరిగెత్తింది.

తనివి తీరని నాగేసర్రావు దిగులుగా పారిపోతోన్న సీతాల్ని చూస్తూ, "పెళ్ళి చేసుకుంటే దీన్నే చేసుకోవాలి. లేకపోతే.... ఛీ! పెళ్ళెందుకూ?" అనుకున్నాడు.

తర్వాత్తర్వాత సీతాలు నాగేసర్రావుకి బాగా చనువైంది. నాగేసర్రావు చెప్పే కబుర్లు వినకపోతే, అతని చూపుల్లో తారట్లాడకపోతే, సీతాలికి మతి మతిలో వుండటం లేదు.

"నాగేసర్రావు కెన్ని కబుర్లు తెలుసో లెక్కలేదు. ఎంటీవోడు ఐద్రాబాదులో పెద్ద మిల్లు కట్టాడంట. నాగేసర్రావు సిన్నప్పుడు గొడ్లని మేపేవోడంట" అంటూ ఎప్పటికప్పుడు తను విన్న కబుర్లు, గచ్చకాయలాడే చెలికత్తెలతో చెప్పి మురుస్తుంది సీతాలు.

ఇప్పుడు సీతాలుకి, ఎంటీవోడికన్నా నాగేసర్రావే నచ్చుతున్నాడు.

నాగేసర్రావు నచ్చుతోంటే ... లాండ్రీ నాగేసర్రావు ఇంకా నచ్చుతున్నాడు.

నాగేసర్రావు పెట్లో నాలుగైదు బొమ్మల పుస్తకాలున్నాయి. తెల్లబోతూ అవన్నీ చూసింది సీతాలు. దొరలూ, దొరసానులూ, సముద్రపొడ్డునా, పూలతోటల్లోనూ నగ్నంగా, ఏకాంతంగా, మహదానందంగా విహరించే దృశ్యాలవి.

"ఈళ్ళంతా తెల్లోళ్ళు. ప్రేమించుకున్నోళ్ళు" అన్నాడు నాగేసర్రావు.

సీతాలు సిగ్గుపడిపోతూ, "ఏంటో బాబూ! సూస్తుంటె వొళ్ళు సచ్చిపోతంది" అని చిరాకు పడింది.

నాగేసర్రావు కొంటె చూపులు చూస్తూ నవ్వాడు. సీతాలికి కోపం కూడా వచ్చింది.

నాగేసర్రావు ఆదివారం, ఆదివారం మధ్యాన్నం నించి లాండ్రీ కట్టేసి అద్దె సైకిలేసుకుని తాడేపల్లిగూడెం సినిమాలకి వెళ్తుంటాడు.

"నువ్వూ రారాదంటే సీతా! సైకిలెనకాల కూచోబెట్టి తీసుకుపోతాను" అన్నాడొకసారి.

కిలకిల్లాడింది సీతాలు. "మంచోడివే, సినేమాల్లో లాగానా?" అంది కుతూహలంగా.

నాగేసర్రావేం మాట్లాడినా సీతాలి కెంతో ముచ్చటగా వుంటుంది. 'అసలాడి యిదే యేరు. ఆడు నడిస్తే అందం, నవ్వితే అందం, ఊసాడితే అందం, ఊరుకుంటే అందం, సిగరెట్టు కాలిస్తే అందం, సయికి లెక్కితే అందం, అసలాడేం చేసినా అందవేఁ' అనుకుంటూ నాగేసర్రావు అడుగడుగులోనూ అందాలు చూస్తుంది సీతాలు.

సీతాలు కళ్ళల్లో మెరుపులూ, మెత్తదనాలూ చూసే నాగేసర్రావు, చీకటిచాట్న సీతాల్ని కావలించుకుని ముద్దులుపెట్టుకున్నాడు చాలాసార్లు.

"ఛీ, ఏం పనేంటి? ఇల్లాగయితే నేను నీకాడికి రానంతే!" అని బెదిరిస్తుంది సీతాలు.

నాగేసర్రావు దీనంగా చూస్తూ, "కోపం తెచ్చుకోకే సీతా! నేను దుర్మార్గుణ్ణంటే? నీకన్యాయం చెయ్యను. ఇంతకన్నా నాకేవదృష్టం వుందే?... నువ్వు నీ బావ సొమ్మేగదా?" అని దిగులుగా మొహం దించుకుంటాడు.

సీతాలు గుండెలు కరిగిపోతాయి. ఏడుపొచ్చినట్టవుతుంది, కళ్ళు చెమ్మగిలతాయి. "నాగేసర్రావూ! అలా అనకూ!... నా ప్రేణాలన్నీ నియ్యే!.... నా అందవూఁ చందవూఁ, నాకాళ్ళూ సేతులూ అన్నీ నియ్యే! నువ్వలా బిక్కమొహం పెడితే సూడలేన్రా!" అని చెప్పేసి, ఓదార్చాలని మనసు కొట్టుకుంటుంది, కానీ, మాట పెగలక, సీతాలు కూడా కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది.

ఒకనాడు మనసు చిక్కబట్టుకోలేక, నాగేసర్రావు దిగులుగా చూస్తోంటే భరించలేక, అతనితో సీతాలు అంతా చెప్పేసింది సిగ్గుపడుతూనే — "రోజూ నువ్వే నా కలల్లో కొస్తన్నావు" అంది.

నాగేసర్రావు సంభ్రమంగా చూశాడు, "నిజంగా నేంటే? ఏం కలలు కాశావు?" అన్నాడు ఆత్రంగా.

"మనం సయికిలెక్కి పోతన్నట్టూ, నేను నిన్ను కావిటేసుకున్నట్టూ" అని సిగ్గుపడిపోయింది.

నాగేసర్రావు హుషారుగా నవ్వాడు, "అదేనే లవ్వంటే. సినిమాల్లోది ఇంకేంటనుకున్నావు? నేనూ నిన్నే లవ్వు చేశానే. కానీ, మరి కొండయ్యో?"

"ఛీ! ఆడి మొకవంటేనే నాకు రోత. సెత్తెప్పెమాణికంగా నిన్నే లవ్వాడినాను. గాడంగా లవ్వాడినాను" అని ధైర్యంగా ప్రియుణ్ణి కావలించుకుంది సీతాలు.

నాగేసర్రావు తన్మయత్వంతో తెల్లబోయాడు.

★ ★ ★

కొండయ్య సీతాలు మీద గంతులు మొదలెట్టాడు. "నీ వొయికరి పసికడతానే వున్నాను. ఆ మాటా ఈ మాటా నా సెవున బడతానే వున్నాయి. ఇదంటే నువ్వు సేస్తన్న యవ్వారం?" అన్నాడు కొండయ్య మండిపడుతూ ఒకనాడు.

సీతాలు తృణీకారంగా చూసింది.

అంతా విన్న పెద్దవాళ్ళు కూడా సీతాల్ని ఒక్కుమ్మడిగా దుయ్యబట్టారు.

సీతాలు తొణకలేదు, బెణకలేదు. ధైర్యంగా చెప్పింది, "నాగేసర్రావంటే నాకిష్టం" అని.

"మరి బావయ్య మాటో?"

"అణ్ణి నేను సేసుకోను"

"ఏంటే పేల్తన్నావ్?" అంటూ లేచాడు సీతాలు బాబు.

కొండయ్య బుసలు కొట్టాడు.

"దాన్ని బెదర గొట్టమాకండి మీరిద్దరూ. దానికే గ్నేనం వస్తది. కుర్రసన్నాసి" అని సీతాలు తల్లీ, మేనత్తా కుర్రసన్నాసికి నచ్చ చెప్పాలని ప్రయత్నించారు. "నీకిలాటి బుద్దుట్టిందేవే పిచ్చిముండా! కష్టసుకాలన్నీ ఇశారించుకున్నావా?.... రొండెకరాల వొరిపొలం, దున్నపోతులా శాకిరీ సేసే మొగుడు, కాలుమీద కాలేసుక్కూకుంటావు. సిన్నప్పట్నుంచీ అనుకున్న సంమ్మందం. అందరం చచ్చేదాకా వొక్కాడ పడుంటాం. ఆ బస్తీ టక్కుటమారోణ్ణి కట్టుకుంటే ఏం తింటావే? రెక్కాడితేగానీ డొక్కాడదు. కొంపన్నా లేదు. సాకిరేవూ సెయ్యడు. ఇస్తిరీ తోవుఁకుంటే సరిపొద్దంటే?" అని బోధించారు.

సీతాలు కేవీ తలకెక్కలేదు — "నాకు డబ్బుతో పన్లేదు. పాపిస్టి డబ్బూసెత్తకండి. నాగేసర్రావెంత అందవైనోడు, తెలివైనోడు! ఆడు మహారాజులాగ సూసుకుంటాడు నన్ను. అణ్ణి తప్ప పర పురుసుణ్ణి కన్నెత్తి సూడను" అని ఘోరంగా శబధం చేసింది.

రత్తమ్మ అప్పటికి చాలించుకుని, తర్వాత చాలాసార్లు కూతురికి బతిమాలి, బుజ్జగించి నచ్చజెప్పబోయింది. "ఎర్రిలో పడిపోతన్నావే కూతురా! కొండయ్య బావని చేసుకుంటే, రాణీభోగం జరుగుద్దే నీకూ. ఆ బస్తీ సోకులోడు నిన్నేదో మాయచేసి మన సిరిసేశాడే! ఆడి జిమ్మడా!" అని తిట్లకి లంకించుకుంది.

సీతాలుకి చాలా కోపం వచ్చింది — "నన్నంటే అనుగానీ, నా బర్తనేవీఁ అనొద్దు," అంది రౌద్రంగా.

"నీ మనసు మారదంటే?" అని ఏడ్చే తల్లిని ఓదార్చింది సీతాలు — "నువ్వు సినిమాలు సూడవు. నీకు లవ్వంటే ఏంటి తెలుస్తాది?.... ఎన్నో తేగాలు సెయ్యాలి. బాదలు పడాలి. నేను మిమ్మల్నందర్నీ వదిలెయ్యగల్ను నాగేసర్రావు కోసం" అంది.

భూత వైద్యాలు చేసే వాళ్ళ దగ్గిరికి తీసుకుపోయి పిలిపించి, బలవంతంగా సీతాలు చేతికి తాళ్ళు కట్టించారు. సీతాలు జోలికొస్తే మర్యాద దక్కదని నాగేసర్రావుకి కబురంపించారు. కొండయ్యకీ, సీతాలుకీ పెళ్ళి ముహుర్తం కూడా పెట్టించారు.

ఆ రోజునే సీతాలు తెగేసి చెప్పేసింది — "నాగేసర్రావుని పెళ్ళాడకపోతే చాకిరేవు చెర్లోపడి సస్తాన"ని!

ఎవ్వరూ వినిపించుకోలేదు.

రోజంతా తిండి తినకుండా పడుకుంది.

ఎవ్వరూ బతిమాలలేదు.

బాగా చీకటి పడ్డాక లేచి అందరి ముందుకూ వచ్చి — "నాకూ మీకూ ఇదే ఆకరి సూపు!" అని అందరూ తెల్లబోతుండగా గాలి వూపులా బయటికి పరిగెత్తింది. కొండయ్య వెనకాల పరిగెత్తి పదిబారల్లో సీతాల్ని పట్టుకుని, బలవంతాన ఇంట్లోకి లాక్కొచ్చాడు.

కొండయ్యకే 'సీ' అనిపించింది. జీవితం మీదే విరక్తి పుట్టింది — "మావయ్యా! దానిష్టవైనట్టే సెయ్యి. అది సుకంగా వుంటే నాకు సాలు. నా మీద

మనసులేని దాంతో నాకేం సంతోసం?" అనేశాడు.

అందరూ కలిసి ఏడ్చారు.

★ ★ ★

సీతాలికీ నాగేసర్రావుకీ పెళ్ళై నెల దాటింది. ఆ నెళ్ళాళ్ళూ నాగేసర్రావు.... అత్తగారింటి దగ్గిరే మనుగుడుస్తూ వున్నాడు.

"బోడెమ్మ ఒటేల్లో పలారాలన్నీ ఆడే తింటన్నాడు. టియ్యంతా ఆడే తాగుతున్నాడు. సున్నుండలూ.... పాకుండలూ.... పుంజీలకొద్దీ మింగుతున్నాడు, చూశారా? ఆడూ.... అదీ.... నేలా నింగీ తెలవనంత తవఁకంతో మిడిసిపడుతున్నారు. ఒకటే ఇకయికలూ, పకపకలూ!" అని కొండయ్య తల్లి దొరికినోళ్ళందరికీ చెప్పుకుని కళ్ళనీళ్ళెట్టుకుంది.

"నీ కొడుక్కేం లోటే? అది కాలదన్నుకుపోయింది గానీ, కోటిమంది పిల్లలు దొరుకుతారు" అని ఓదార్చారు విన్న వాళ్ళంతా.

సీతాలు పెళ్ళైపోయిం తర్వాత, కొండయ్య కోసం ఊళ్ళోవాళ్ళూ, పై వూళ్ళోవాళ్ళూ ఎగబడ్డారు.

కొండయ్య "నాకు పెళ్ళేవొద్దు" అన్నాడు. పెళ్ళి చేసుకోకుండా జీవితమంతా వుండి, చచ్చిపోతానన్నాడు. సీతాలు సుఖమే తన సుఖమన్నాడు.

మళ్ళీ అందరూ కలిసి ఏడ్చారు.

నెలాఖర్న సీతాల్ని అత్తగారింటికి పంపించారు. అక్కడో వారం రోజులుండి పుట్టింటికొచ్చింది. మళ్ళీ మూడో నెలలో నాగేసర్రావు, భార్యని తీసుకుపోయాడు.

సీతాలుకి నాగేసర్రావుతో అన్ని సరదాలూ తీరాయి గానీ, మొగుడి వెనకాల కూచుని సైకిల్‌మీద సినిమాకి వెళ్ళటం పడనేలేదు. నాగేసర్రావు ఆదివారం ఆదివారం వెళ్తూనే వున్నాడు.

"నన్నూ తీసికెల్తానన్నావుగా?" అని సీతాలు చాలాసార్లు మారాం చేసింది.

నాగేసర్రావు విసుక్కుని, "ఏంటెహె పిచ్చి లంజా! అప్పుడేదో ఆసికానికన్నాను. ఆడదానివి, సైకిలెలా ఎక్కుతావూ?" అన్నాడు.

సీతాలికి కొంచెం కష్టం వేసింది ఉత్సాహం చచ్చిపోయింది. సినిమాల్లో తప్ప ఆడవాళ్ళు సైకిలెక్కటం సీతాలు కూడా ఎప్పుడూ చూడలేదు. "ఏం, సినేమాల్లో లాగ వుంటేయేం?" అనుకుంది. మొగుడితో అనే ధైర్యం లేక ఊరుకుంది.

సీతాలికి ఇంకో కోరిక కూడా తీరలేదు. తెల్లోళ్ళు కావటేసుకుని తీయించుకున్న ఫోటోలాంటిది మొగుడితో తీయించుకుని గచ్చకాయల స్నేహితురాళ్ళకి చూపించాలని సీతాలికి పెళ్ళికి ముందునించే వుంది.

ఫోటో మాటెత్తితే నాగేసర్రావొప్పుకోలేదు సరికదా, కసిరేశాడు. "ఫోటో తీసేవోడిముందు సిగ్గూ లజ్జా లేకండా కావలించుకోమంటావేంటే? తెల్లోళ్ళకంటే తప్పు లేదు" అన్నాడు.

సీతాలుకి ఉక్రోషం వచ్చింది. "ఆళ్ళకి లేని తప్పు మనకెందుకేంటి? తెల్లోళ్ళలాగ బతకాలని నువ్వోసారి నాతో సెప్పలేదా?" అని వాదానికి దిగింది.

"అదీ ఇదీ వొకటి కాదే ఎర్రిలంజా!" అన్నాడు.

"ఎందుక్కాదు?" అంది ఏడుపు మొహం పెట్టి.

పెళ్ళాం గోల పళ్ళేక నాగేసర్రావు... ఒకసారి సీతాల్ని తాడేపల్లిగూడెం తీసుకుపోయి.... దాని భుజంమీద చెయ్యేసి ఫోటో తీయించుకున్నాడు. అది సీతాలికి నచ్చనేలేదు. "బుజం మీద చెయ్యేస్తే కాదు, సినిమాల్లోలాగా కావిలించుకోవాలి. లవ్వాడుకున్నోళ్ళు అలాగుండొద్దా? బస్తీవోడి క్కూడా సరసం తెలవదు" అని దిగాలు పడింది.

ఆర్నెల్లనించీ సీతాలు మొగుడి దగ్గరే వుంటోంది. మునుపటి హుషారూ .... కేరింతలూ.... కొంటె చూపులూ ... ఇద్దరికీ బాగా తగ్గిపోయాయి. లాండ్రీ గుడ్డలు ఉతకటం సీతాలు పుట్టింటి వాళ్ళు పెళ్ళయిన నెల్లాళ్ళకే మానేశారు. ఎంకడికి ఏదో తగని తెగులు పట్టుకుంది. కొండయ్య వ్యవసాయం పనుల్లో చాకిరేవులు తగ్గించుకున్నాడు.

లాండ్రీ బట్టలు పెళ్ళాన్నే ఉతకమన్నాడు నాగేసర్రావు.

సీతాలు తెల్లబోయింది. "నేనా! సాకిరేవు సెయ్యనా!" అంది.

"ఏం, నువ్వేం దొరసానమ్మ ననుకుంటన్నావా? సాకలి పుటక పుట్టలేదంటే?" అన్నాడు నాగేసర్రావు.

"నాకా పని తెలవదు. మీ అమ్మని పొమ్మను. నేనింటికాడుండి కూడొండుతా" అంది.

నాగేసర్రావుకి చాలా కోపం వచ్చింది "సాకలోడికి

పుట్టలేదంటే? పని చేసుకోకపోతే ఎలా గడుస్తదనుకున్నావు? ముసలిముండ సాకిరేవు చేస్తే.... నువ్వు సినిమా బొమ్మలాగ సింగారించుకుని కూకుంటావా?" అని కేక లేశాడు.

సీతాలికి భయంవేసి ఏడుపొచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూనే మూట పట్టుకుని చాకిరేవు కెళ్ళింది.

సీతాలి సంసారం సంగతులన్నీ తెలిసినా, పుట్టింటి వాళ్ళు తొంగీ వొంగీ చూడలేదు. పిల్ల వెళ్ళి ఆర్నెల్లయినా, దాన్ని గుమ్మంలోకి రమ్మని పిలవలేదు.

"అళ్ళు పిలవకుండా నువ్వెళ్తే నేవొప్పుకోను" అన్నాడు భర్త.

"దాని కిష్టవైన మొగుడికాడ, లవ్వాడిన మొగుడి కాడ, సుకంగా వుందిగా? దాని వూసు మాకెందుకూ?" అంది సీతాలు తల్లి, చాలా మంది దగ్గిర.

"అత్తోరు ఊళ్లోనే వుంటే... కాలికీ సేతికీ అడ్డ వొస్తారని.... సేసుకున్నాంగానీ, లేకపోతే ఈ తగూల మారి సమ్మందం మాకేలమ్మా?" అని అందరి ముందూ రాగాలు తీస్తుంది నాగేసర్రావు తల్లి.

అందరి కబుర్లూ వింటోంటే సీతాలికి కంపరం పుట్టింది. ఆర్నెల్ల నించీ చాకిరీతో ప్రాణం విసిగి పోతోంది. ఇప్పుడు సీతాలుకి నాగేసర్రావు కూడా అందర్లాగే కనపడుతున్నాడు. నాగేసర్రావు సిగరెట్లు కాలుస్తోంటే సీతాలికి ఇప్పుడు వొళ్ళు మండుతోంది. "ఎందుకలా తగలేస్తావు డబ్బులు?" అంది చాలా సార్లు.

"ఏం? నీ బాబు సొమ్మా?" అన్నాడు అతను.

"నా బాబు వూసెందుకూ?" అంది సీతాలు.

"నా డబ్బును నేను కర్చు చేసుకుంటే నీకా నీలుగుడెందుకూ?" అన్నాడు అతను.

ఒక్కోసారి ఇద్దరూ కుమ్ములాడుకుంటారు.

చివరికి నాగేసర్రావు చెయ్యి చేసుకుంటాడు.

సీతాలు ఏడుస్తూ నేలమీద పడుకుంటుంది.

ఎంతో అవసరమైతే తప్ప మొగుడితో మాట్లాడ్డం సీతాలికిష్టం వుండదు. నాగేసర్రావు ఆదివారం సినిమా కెళ్ళటం సీతాలికి బొత్తిగా ఇష్టం లేదు. వెళ్తే తననూ తీసికెళ్ళమంది. తీసికెళ్ళనన్నాడు. పోట్లాడి తన్నులు తింది. 'బావయ్యా నేనూ ఎన్ని సినేమాల కెళ్లావో!' అని పాత రోజులు తల్చుకు తల్చుకు ఏడ్చింది.

"ఏంటే సీతా, అంత సిక్కిపోతన్నావు?" అని చాకిరేవులో గచ్చకాయల నేస్తం పలకరిస్తే... సీతాలు వలవలా ఏడ్చేసింది. ఏడుస్తూ ఏడుస్తూ చెప్పేసింది "ఆర్నెల్ల పొద్దయ్యి సుఖం ఎరగనంటే నమ్ము. వొంటి సోకు లేదు, బుర్ర సోకు లేదు, సినిమాలసలే లేవు. కొంపలో ముసలి ముండ పోరొకటి. మావాళ్ళొద్ది లేశారని దెప్పి పొడవకపోతే దానికి నిద్దరే పట్టదు. ఇంక ఆడి వూసా? మాటాడితే కయ్యిన కరవొస్తాడు. ఆడి పద్దులేంటో, ఆడి సినేమాలేంటో! ఆడిలాంటోడవుతాడని నేననుకోలేదే సత్తీ!" అని చెప్పి బావురుమంది.

"సేతులారా నీ గొయ్యి నువ్వే తవ్వుకున్నావు" అందామనుకుని సత్తి జాలిపడి వూరుకుంది.

"మీ అమ్మకూడా నీకోసం బెంగెట్టుకుంది. మీ అయ్య మంచం దిగటం లేదు. ఒక్కసారొచ్చి అళ్ళని సూడరాదా? అళ్ళ కోపాలూ పోతాయి. ఏడిస్తే లాబమేంటి? ఊరుకో సీతాలూ!" అని ఓదార్చింది.

సీతాలు ఏడ్చి ఏడ్చి ఇంటికి పోయింది. ఆ రోజంతా సీతాలు మనసు, తల్లి చుట్టూ, తండ్రి చుట్టూ తిరిగింది. రహస్యంగా వెళ్దామా అనుకుంది. మళ్ళీ జడిసింది.

ఊళ్ళోకి ఒకాయన కావిడితో బట్టలమ్మ దెచ్చాడు.

"నాకో కోక కొంటావా?" అని అడిగింది సీతాలు మొగుణ్ణి.

"డబ్బుల్లేవే .... అరువిస్తాడేంటో కనుక్కో" అన్నాడు నాగేసర్రావు.

సీతాలు అడిగి వచ్చింది. "ఇవ్వడంట. ఎక్కడన్నా అప్పుచ్చుకోరాదా?" అంది.

"అప్పు చేసి పప్పు కూడనీ, ఉప్పుడా కోక కొనుక్కోకపోతే యేం? నీ బాబు ఊళ్ళోనే వున్నాడుగా? కొంటాడేమో అడుగు" అన్నాడు నాగేసర్రావు వెటకారంగా.

సీతాలికి ఉక్రోషం వచ్చింది. ఏడుపు మొహం పెట్టింది. "నిన్ను కట్టుకున్నాక నావోళ్ళంతా దూరమయ్యారు" అంది.

"ఏం అయితే? నీకేం లోటొచ్చింది?" అన్నాడు.

"నా బతుక్కింక వొకటే లోటు" అని నిట్టూర్చింది.

"ఏడిశావులే!" అన్నాడు.

"ఏడుస్తానే వున్నా" అంది ఏడుస్తూ.

ఆ ఏడుపు సీతాలు మనసుని చెదలు పట్టినట్టు

తినేసింది. కుమ్మరి పురుగులాగ దొలిచేసింది. మొగుడంటే దడ పట్టుకుంది. "లవ్వాడి పెళ్ళి చేసుకున్నా. బతుకిలాగుందేంటి? సినేమాల్లో లాగ లేదు. లవ్వంటే తెలవనోళ్ళే సుకంగా వున్నారు. నాదే అద్దాన్నం అయింది" అని కుమిలికుమిలి ఏడ్చింది, మొగుడు చూడకుండా.

ఆ సాయంత్రం చాకిరేవు గుడ్డలు ఇంటిదగ్గిర పడేసి, చీకటి పడుతోంటే మళ్ళీ చాకిరేవులోకి బయల్దేరింది, ఇంటి దగ్గిర ఉండబుద్ధి కాక.

కల్లు పాకలోంచి బయటికొచ్చి, ఊళ్ళోకి పోతూ చాకిరేవు చెరువొడ్డున గానుగు చెట్టుకింద ముడుచుక్కూచున్న నల్లకోక మనిషిని చూశాడు కొండయ్య.

"ఎవరా మడిసి?" అని పలకరించాడు.

"బావయ్యా!" అని బావురుమంది సీతాలు.

"ఏంటే ఈ సీకట్లో?" అని మరీ దగ్గిరి కొచ్చాడు.

కొండయ్య మొహం చూస్తోంటే సీతాలు కడుపు తరుక్కుపోయింది. చాలా దీనంగా కనపడ్డాడు. కోపం పెట్టుకుని గిరుక్కున తిరిగి వెళ్ళిపోలేదు. అభిమానంగా పలకరించాడు. సీతాలికి దుఖ్ఖమాగలేదు — "నీ కన్నేయం సేశాను బావయ్యా! నాకు పోయేకాలం బుద్దుట్టింది! నీ వుసురే నాక్కొట్టింది" అని మళ్ళీ ఏడ్చింది.

కొండయ్య నిషాతో తూలుతూ ఏడుస్తోన్న సీతాల్ని వాడిసి పట్టుకున్నాడు. "యాడవకే సీతా! నీకేటయ్యిందే? నీ పేణానికి నా పేణం అడ్డు. ఆడేటన్నా అన్నాడా? నరికేత్తానెదవని" అని సముదాయించాడు.

"బావయ్యా! నేనాడికాడుండలేన్రా! సెర్లోబడి సత్తాన్రా! అందుకే కూకున్నానిక్కడ" అని వెక్కిళ్ళెట్టింది సీతాలు.

"షెష్! అదేం మాట? లవ్వాడినావు. ఆడే నీకు సినేమా నాగేసర్రావు" అని సరస మాడాడు బావయ్య.

సీతాలు మళ్ళీ ఏడ్చింది. ఏడుస్తూ, "నీకు తెలవదా? నాకు ఏఏట్టివోడే ఇస్టం!" అంది.

కొండయ్య వినిపించుకోలేదు. "లెగు లెగే! పోదారి, పురుగో పుత్రో" అంటూ సీతాలు జబ్బట్టుకున్నాడు!

అమాంతంగా కొండయ్యాని కావిటేసుకుంది సీతాలు. "నేనూ మనింటి కొచ్చేస్తాన్రా! నీకాడే వుంటాన్రా! ఆడంటే రోతుట్టేసిందిరా! బావయ్యా, నన్ను తీసుకుపోరా!" అని కొండయ్య చేతుల్లో వొదిగింది.

కొండయ్య తెల్లబోయాడు. అంతా మత్తుమత్తుగా వుంది. నమ్మలేనిదేదో జరుగుతున్నట్టుగా వుంది. తన మరదల్ని లాక్కున్న నాగేసర్రావు మీద కొండయ్య కేనాటినించో కసిగా వుంది. సీతాలు అలాగ కాళ్ళూ చేతులూ చుట్టేసి కళ్ళలోకి చూస్తోంటే, "నా వొళ్ళంతా తేలిపోతందే సీతా! గుండెక్కడికో ఎగిరిపోయిందే! నాకేంటో మతిపోతందే!" అని సీతాల్ని గట్టిగా కావిలించుకున్నాడు. "నిజంగా వచ్చేస్తావేంటే?" అన్నాడు వెర్రి చూపులు చూస్తూ.

"నీ మీదొట్టు! అమ్మ తోడు! సత్తెప్పెమాణకం!" అంది సీతాలు ఆనందంగా.

"ఏడవమను ఎదవని. ఉప్పుడేం షేస్తాడో!" అంటూ ఉత్సాహంగా సీతాల్ని ముద్దు లెట్టుకున్నాడు కొండయ్య.

అంతకన్న హుషారుగా సీతాలు కొండయ్య చెంపలన్నీ కరిచి.... పెనవేసుకుంది, చీకట్లో, గానుగు చెట్టుకింద.

చీకటి చిక్కబడింది.

చాకిరేవు చెరువులోకి చుక్కలన్నీ స్నానాని కొచ్చాయి. చెట్టుమీద పిట్టలు సద్దుమణిగి గూళ్ళల్లో వొదిగాయి. రయ్యిన వీచేగాలి, గానుగు చెట్టు ఆకులు రాలగొడుతోంది. దూరంనించి కల్లుపాక దగ్గర గోలా, తిట్లూ, లల్లాయి పదాలూ నిశ్శబ్దం నిండా జొరబడుతున్నాయి.

ఊపిరందని అగాధంలో పడి కొట్టుకుని కొట్టుకుని వొడ్డెక్కినట్టుంది సీతాలికి. సింహాసనం మీద నించి కిందపడి దుమ్ములో దొర్లిదొర్లి, మళ్ళీ సింహాసనం ఎక్కినట్టుంది కొండయ్యకి.

కీచురాళ్ళ ఈలల మధ్యా, నక్కల ఊళల మధ్యా, గడ్డిలో పాకే పురుగుల మధ్యా, దెయ్యాల భయాల మధ్యా, ముదిరిన చీకట్లో, వాళ్ళిద్దరూ శాశ్వతంగా ఒకటై పోయామనుకున్నారు.

★ ★ ★

సీతాలు, పుట్టింట్లో వాకిట్లో కూచుని పొరుగింటి పిల్లలతో గచ్చకాయ లాడుతోంది.

నాగేసర్రావు మండిపడుతూ వచ్చాడు.

సీతాలు హడలిపోయి చుట్టింట్లోకి పరిగెత్తింది.

రత్తమ్మ అల్లుణ్ణి చూసి పీట వేసి, "కూకో" అంది.

"దాన్నిలా రమ్మను. ఎళ్ళాలి" అన్నాడు.

సీతాలు విసురుగా తలుపులేసుకుంది "నేన్రాను. నీకూ నాకూ ఇంక సంబంధం లేదు" అని లోపల్నించి అరిచింది.

"ఏం అత్తా? అంతేనా?" అన్నాడు నాగేసర్రావు రత్తమ్మని కొరకొరా చూస్తూ.

"నన్నేం సెయ్య మంటావు నాయనా? నేను సెప్తే ఇంటదా? నిన్నే సేసుకుంటానంటే సెయ్యలేదా? ఉప్పు డెల్లనంటే నేనేం సెయ్యను? దాన్ని పువ్వులాగ పెంచాం. నీ సేతుల్లో ఎట్టాం. నిలుపుకున్నావు కాదు" అంది రత్తమ్మ నిష్ఠూరంగా.

గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు నాగేసర్రావు.

తలుపులు తీసుకుని నవ్వుతూ బయటికొచ్చింది సీతాలు.

తర్వాత — కుల పెద్దల మధ్య .... నాగేసర్రావుకి రెండు వందల రూపాయలు 'తప్పు' ఇచ్చుకుని, కూతుర్ని మనువునించి విముక్తి చేశాడు ఎంకడు.

నెల తిరిగేసరికి, సీతాలికి కొండయ్యకి వైభవంగా పెళ్ళయింది. నాగేసర్రావు అప్పులు తీర్చేసి తల్లి నెవ రింట్లోనో అప్పజెప్పి ఊరొదిలి వెళ్ళిపోయాడు. మిల టరీలో కెళ్ళాడన్నారు కొందరు, పోలీసు పనికన్నారు కొందరు. ఏమీ తెలియదు సీతాలికి. కొండయ్యతో ప్రేమలో మునిగిపోయింది.

ఇప్పుడు సీతాలికి చాలా సుఖంగా వుంది. బారెడు పొద్దెక్కిగానీ లేవదు. రోజూ హోటల్లోంచి ఇడ్లీలో, పెస రట్లో తెప్పించుకుని తింటుంది. ఇష్టమైతే చాకిరేవు కెళ్తుంది, లేకపోతే ఇంటిదగ్గిరుండి కూడూ, కూరా ఉడకేస్తుంది. మధ్యాన్నంవేళ ఇరుగు పొరుగు పిల్లల్ని చేర్చుకుని చింతపిక్కలో, గచ్చకాయలో ఆడుతూ కూచుంటుంది. చీకటి పడేసరికి, లేచి ముస్తాబు ప్రారంభిస్తుంది.

సీతాలి అత్త కోడలి కబుర్లు అందరితోటీ చెప్పి మురుస్తూ వుంటుంది.

"ఆడు దాని మన సిరిసి పాడు చేసేశాడుగానీ, అసలు మా సీతకి కొండయ్యంటే ఎంతిష్టవను కున్నావు? రోజూ సందేల .... ఉడుకు నీళ్ళతో సువా సన సబ్బు తోవుఁకుని తానంచేసి, ఇస్తిరీకోక కట్టుకుని .... పొగడ్రా అదీ రాసుకుని గువ్వలాగ మొగుడి పక్కలో దూరి తొంగుంటది. దాని పేణవూఁ ఆయిగా వుంది, మా పేణాలూ ఆయిగా వున్నాయి"

★ ★ ★

నాగేసర్రావుని కావిటేసుకున్నట్టు కలొచ్చి సీతాలు అప్పుడప్పుడూ ఉలిక్కిపడేది నిద్దట్లో.

"ఆ డూసు నాకెందుకూ?" అని కొండయ్య గుండెల్లోకి జరిగేది.

రోజులూ వారాలూ నెలలూ సుఖంగా గడిచి పోతోంటే, సీతాలికి పాత భయాలూ ఏడుపులూ, మరుపున పడ్డాయి. నాగేసర్రావంటే గుండెల్లో వుండే దడా, బితుకూ కూడా నెమ్మదిగా తగ్గుముఖం పట్టాయి.

"ఆడెక్క డున్నాడో!" అని ఏ అర్ధరాత్రో ఒక్కక్షణం ఆలోచించేది.

"నాగేసర్రావు ఢిల్లీలో వున్నాడంట. మిలట్రీలో సేరాడంట, ఆళ్ళమ్మకి ఉత్తరం రాశాడు" అన్నారెవరో.

ఆ కబురు విన్నప్పుడు — "అమ్మబాబో! ఢిల్లీ ఎల్లాడా?" అని ఆశ్చర్యపడింది సీతాలు.

నాగేసర్రావు, వాళ్ళమ్మకి డబ్బు పంపుతున్నాడు. ఉత్తరాలు రాస్తున్నాడు. ఊళ్ళోవాళ్ళు నాగేసర్రావుని మునపటి కన్నా గొప్పగా చెప్పుకుంటున్నారు.

"ఆడెంతోడయ్యాడో!" అనుకుంది సీతాలు.

సీతాలికీ కొండయ్యకీ పెళ్ళయ్యి ఏడాది దాటింది. అప్పట్నించీ రోజులన్నీ వొక్కలాగే గడుస్తున్నాయి — "తిఁడీ, నిద్దరా, మొగుడికాడ తొంగోటం, ఏంటో ఇసుకొస్తంది" అని చాలాసార్లు విసుక్కుంది సీతాలు.

"అలా కూకోపోతే ఏదో వొక పని సెయ్యరాదా? సుకంగా గడుస్తది పొద్దు" అన్నాడు కొండయ్య చాలా సార్లు.

"నువ్వు సేస్తన్నావు. సాల్లే" అని మూతి తిప్పు కుంది సీతాలు.

మొగుడు హుషారుగా వున్నప్పుడు సీతాలు చాలాసార్లు అడిగింది. "పుట్టిన కాణ్ణించీ వొక్కసోటే పడిసస్తన్నాం. ఎప్పుడూ ఈ ఊరేనా? ఎక్కడికన్నా ఎల్దాం బావయ్యా! మెడ్రాసూ, ఏడుకొండలూ, ఢిల్లీ అన్నీ సూద్దాం. ఎప్పుట్ వోణ్ణి ఎప్పుడు సూస్తాం?" అని మారాం పెట్టింది.

మొదట్లో నవ్వేసి ఊరుకున్నాడు కొండయ్య. తర్వాతర్వాత కసరటం మొదలెట్టాడు. "నీకేం మతి లేదేంటే? మెడ్రాసంటే కొండంతూరు. అక్కడ సిన్నకార్లే ఈగల్లాగ ముసురుతయ్యంట. ఎక్కడేంటి సూడాలో మనకెల్లా తెలుస్తయ్యి?" అన్నాడు.

"నాలుగొంద లట్టుకో, ఎంకటేశుని తీసికెల్దారి మనతా. అన్నీ సూపిస్తాడు."

"ఉప్పుడు నాలుగొంద లెక్కడున్నాయ్యే?"

"అప్పు తేకూడదేంటి?"

"ఏడిశావులే, అప్పుచేసి మెడ్రాసు సూడకపోతే పేణాలు పోతయ్యంటే?"

"ఛీ! నువ్వలాగే అంటావు. పేణాలుంటే సాల్సు కావాల. ఒక ముద్దూ లేదు, ముచ్చటా లేదు. మన కంటా పేదోళ్ళు సెట్టాపట్టాలేసుకుని, సిలుకు సిలుకు గుడ్డలు కట్టుకుని, పాటలు పాడుకుంటా కార్లెక్కి రెయిళ్ళెక్కి అయిగా తిరుగుతారు. సినేమాల్లో చూడ లేదా?"

"అదంతా యాక్సనే పిచ్చిమెహందానా!"

"అయితే మాత్రం? మనం అలాగ ఎందుకుండ గూడదూ? అందరూ అలాగ వుండాలనే గందా ఆళ్ళు యాక్సను చేసి చూపిత్తారు? .... ఛీ పాడు! నీకే వుసారూ లేదు. ఎప్పుడూ ఎవసాయం, శాకిరీ, ...."

"వాలే! అట్టే పేలకు! మెడ్రాసంటే తాడేపల్లిగూడెం లాగుంది కావాల నీకు. మనూరు కరనంగారూ, మునసబుగారే సూళ్ళేదు మెడ్రాసు" అన్నాడు కొండయ్య కోపంగా.

సీతాలుకి ఏడుపొచ్చేసింది, "ఇంత మాత్రానికే కసరాలా? పోనీ వొచ్చే ఏడెల్దారి, ఆ పైయ్యేడెల్దారి — అని గడ్డం పట్టుకుని చెప్పకూడదా?" అని మొహం దించుకుంది.

ఆ రోజంతా నాగేసర్రావు ఆలోచనలు సీతాల్ని ముసురుకున్నాయి. 'మునసబుగారూ, కరనంగారూ కూడా ఎల్లని ఢిల్లీ ఎల్లాడు. ఆడెంత గొప్పోడో! అసలా డెప్పుడూ గొప్పోడే! ఆడికన్నీ తెలుసు. కష్టపడి పని సెయ్యాలనే వోడు. అందులో తప్పేటుందీ? ఏంటో అప్పుడు పనంటే కొత్త. గాబరా పుట్టేసింది. ఆడి కాడేవుంటే ఢిల్లీ తిప్పేవోడు కాడా? కరమిలా గుండ బట్టి బుద్ధి సెడిపోయింది. పాపం ఆడు నాకోసం అభిమానంతో వచ్చాడు. రాను పొమ్మన్నాను. ఎంత భాధ పడ్డాడో! ఆడికి కోపం ముక్కు మీదుండేది గానీ, నెమ్మదిగా సెబితే అన్నీ ఇనేవోడు. ఎందుకయన్నీ తల్చుకోటం? ఇక ఈ బతుకింతే!' అని దిగులుపడి నిట్టూర్చింది.

ఆ రాత్రి నాగేసర్రావుమీద కలవస్తే ఉలిక్కిపడి లేచి ఏడుస్తూ పడుకుంది సీతాలు. ఈ ఎదవ ఊళ్ళో .... ఈ మొద్దు మొకం మొగుడితో, ఎన్నాళ్ళిలాగ?

★ ★ ★

మిట్ట మధ్యాన్నం ఎండ నిప్పులు చెరుగుతోంది. ఈ చెవులోంచి గాడుపా చెవులోకి ఈడ్చి కొడుతోంది. ఎక్కడా కాకి కావుమనటం లేదు. చాకలివాళ్ళంతా అలిసిపోయి చెట్లకింద కూచున్నారు. ఉతికారేసిన బట్టలు తాళ్ళనిండా అద్దం బిళ్ళల్లాగ మెరుస్తున్నాయి. కొంతమంది తిళ్ళు తిని, చెట్ల నీడల్లో పడుకున్నారు. కొంతమంది కబుర్లాడుకుంటున్నారు.

సీతాలు గానుగ చెట్టుకింద చతికిలబడి వాళ్ళత్తతో పేలు చూపించుకుంటోంది.

"పోలీసోడు, పోలీసోడు" అన్నారెవరో. అందరూ అటు చూశారు.

ఎవరో కాకీ బట్టల మనిషి. తట్టంత టోపితో, పెద్దపెద్ద బూట్లతో, దర్జాగా అంగలేసుకుంటూ వస్తు న్నాడు. అందరూ భయంగా వొకరి మొహాలొకరు చూసుకున్నారు.

సీతాలికేదో అనుమానం వచ్చింది. గుండె గుబ గుబ లాడింది. చప్పున జుట్టు గోళ్ళతో దువ్వి ముడేసు కుంది.

ఆ మనిషి బాగా దగ్గిరి కొచ్చాడు. నెత్తిమీద టోపీ తీశాడు. అందరికీ పోలిక దొరికాడు. నాగేసర్రావే! నవ్వుతున్నాడు. బాగా బలిశాడు.

"ఓరి, నువ్వంట్రా? ఎవడో పోలీసోడు వస్తన్నాడని అడలి సత్తన్నాం" అంటూ అందరూ చుట్టూ చేరారు.

"ఏంట్రా? ఈ దిరీసు లేంటీ, ఈ టోపీ లేంటీ? మిలట్రీలో సేరావంటగా? ఏం పని సెయ్యాల? ఎంతిస్తారేంటి?"

"అదంతా తరవాతగానీ ముందు మా అమ్మని చూడాల. ఆకలి మండిపోతంది. ఎవరింటి కాడన్నా అన్నం వుంటే కొంచెం పెట్టండి" అన్నాడు నాగేసర్రావు గబగబా.

"మా ఇంటికాడ సేపల పులుసుందిరా!"

"మా ఇంటికాడ రొయ్యల కూరుందరోయే."

"అయితే, అన్నీ తీసుకురండి. సఫా చేసేస్తా" అని నవ్వాడు నాగేసర్రావు.

అతనితో నలుగురైదుగురు ఊళ్ళోకి బయల్దేరారు. సీతాలు మతిపోయిందాని లాగ నాలుగడుగులేసింది వాళ్ళ వెనక.

"ఏంటె, ఆ ఎర్రి సూపూ?" అని కసిరి వెనక్కి లాగింది వాళ్ళత్త.

సీతాలికి మతి మతిలో లేదు.

నాగేసర్రావొచ్చి నాలుగు రోజులైంది. వాళ్ళమ్మని తీసుకుపోవటానికి వచ్చాడంట. ఆ నాలుగు రోజులూ ఎడతెరిపి లేకుండా అడిగిన వాళ్ళందరికీ కబుర్లు చెప్పాడు.

వాళ్ళు వీళ్ళూ చెప్పుకుంటోంటే సీతాలు చాలా కబుర్లు విన్నది — నాగేసర్రావుకి మిలట్రీ వుద్యోగవంట. గవర్నమెంటోళ్ళే అన్ని సదుపాయాలూ సూస్తారంట. సినేమాలు సూపిస్తారంట. ఇద్దం వొస్తే చైనా వోళ్ళనీ, పాకీస్తానం వోళ్ళనీ, దోవల్ని సంపినట్టు సంపెయ్యాలంట. నాగేసర్రావుకి 'కాణీ' కర్చవదంట. డబ్బంతా దాసేసుకోవచ్చునంట. తిండీ గుడ్డా అన్నీ గవర్నమెంటోడియ్యే. కొన్నాళ్ళు ఢిల్లిలో వుండి, బొంబాయీ మెద్రాసూ, అన్నీ తిరుగుతారంట!"

ఊళ్ళో అందరూ నాగేసర్రావు గొప్పే చెప్పుకుంటున్నారు. నాగేసర్రావు అదృష్టాన్ని పొగుడుతున్నారు.

కొండయ్యకి ఒళ్ళుమండి, "మిలట్రీ ఓడి బతుకెంత! ఎప్పుడు సత్తాడో తెలవదు" అన్నాడు.

"కాకిలాగ కలకాలం బతికే కంటే అంసలాగ ఆరునెల్లు బతికితే సాలదా?" అందామనుకుంది సీతాలు కసిగా.

సత్తి కూడా నాగేసర్రావుని చూసి వచ్చింది. "అడు బాగా తెల్లబడ్డాడే! వొళ్ళుసేశాడు. అళ్ళమ్మ కొక మంచి కోక తెచ్చాడు. ఇంకా బొమ్మలయ్యా తెచ్చి ఎవళ్ళెవళ్ళకో ఇచ్చాడు" అంటూ ఎప్పటికప్పుడు కబుర్లన్నీ సీతాలికి చెప్పింది.

"నా ఊసెత్తాడా? ఎవర్నన్నా నా మాటడిగాడా?" అని ఆరా తీసింది సీతాలు.

"నన్నడగలేదు గానీ, సుబ్బులు సెప్పింది. 'సీత బాగుందా? ఏవన్నా పిల్లలా?' అన్నాడంట."

సీతాలికి కితకితలు పెట్టినట్టయింది. పకపకా నవ్వింది.

నాగేసర్రావు తెల్లారగట్ల .... తల్లిని తీసుకుని వెళ్ళిపోతాడని సీతాలు విన్నది. కంగారుపడింది.

ఉన్న నాలుగు సామాన్లూ ఒక పెట్టిలో సర్ది .... రాత్రి పదకొండు గంటల వరకూ అందరితోనూ మాట్లాడి, చీకట్నే లేవాలని, పడుకున్నాడు నాగేసర్రావు. మాగన్నుగా నిద్రపట్టింది. ఎవరో తెల్లకోక మనిషి కాళ్ళ దగ్గిర నిలబడ్డట్టయితే ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు నిద్రమత్తులో మాట పెగుల్చుకుని "ఎవరదీ?" అన్నాడు గట్టిగా.

"నేను, సీ .... త .... ని."

చటుక్కున లేచి కూర్చున్నాడు. ఎగాదిగా చూశాడు.

"ఎందుకొచ్చావు?"

జవాబు చెప్పలేదు. వెక్కివెక్కి ఏడవడం మొదలెట్టింది.

"ఏంటా ఏడుపు? ఎందుకొచ్చావు?"

"నేను తప్పే సేశాను. అంతా కొత్త. శాకిరీకి జడిసి ఎల్లిపోయాను."

"సరేలే! అదంతా ఎందుకిప్పుడు? ఆడి కాడ డబ్బుంది. నాకాడ లేదు. అందుకే గదా పారిపోయావు? సుకంగా వుండు."

"అలా అనమాకు. నే విన్లేను. డబ్బుకోసం మోజుపళ్ళేదు. బుద్ధి తక్కువయింది. నీ కోసమే ఎయ్యి కళ్ళతో ఎదురు సూస్తన్నాను. నన్ను కూడా నీ ఎంట తీసికెల్లిపో! నీకాడే పడుంటాను. ఇద్దరం అయిగా సుఖంగా ఉందాం. నీ మీద పుట్టి డాశెపెట్టుకొచ్చాను" అంటూ నాగేసర్రావు కాళ్ళదగ్గిర కూలబడింది.

నాగేసర్రావు తెల్లబోయాడు — "కొండయ్యో?"

"అడి మొకం సూడనింక."

"శన్, నోరుముయ్! నీతీ జాతీ లేదంటే? ఏబ్రాసి ముండలాగా ఆడికాడికీ నా కాడికీ తిరుగుతుంటావా? ఎవర్నో ఒకర్ని నమ్మాలి. గ్నేనం తెచ్చుకుని ఆడితో అన్నా సుకంగా వుండు. నా ఊసెత్తితే వూరుకోను."

సీతాలు బెదిరిపోయింది. బిక్కచచ్చి నించుంది. తెల్ల ఇస్త్రీ కోక కట్టుకుని, పూలెట్టుకుని వచ్చింది. నాగేసర్రావు మురిపెంగా చూస్తూ మాట్లాడతాడను

కుంది.

"ఎళ్ళింక" అన్నాడు నాగేసర్రావు.

కదల్లేదు సీతాలు. కొంచెం ధైర్యం కూడగట్టు కొంది. "లవ్వు సెయ్యటం మన సేతుల్లో వుండదని నువ్వన్లేదా? కొత్త లవ్వు కోసం పాత లవ్వు మరచిపో వొచ్చుని అన్లేదా?" అంది ఆశగా చూస్తూ.

నాగేసర్రావు ఆశ్చర్యపడ్డాడు. ఎప్పటి సంగతది! కోపంగా అన్నాడు. "అదంతా డబ్బున్నోళ్ళకీ పేరున్నోళ్ళకీ చెల్లుబడి. మనక్కాదు"

"ఎందుక్కాదు? మరి ఆ మాట నాకెందుకు సెప్ప లేదు?" ఏడ్చింది.

ఒక్క క్షణం నాగేసర్రావుకి కోపం పోయింది. మాట్లాడకుండా కూచున్నాడు.

"అప్పుడాడి మీదకి బుద్ధిపోయింది. ఎల్లి పోయాను. ఇప్పుడు నీ మీదే వున్నాయ్యి నా పేణాలన్నీ. ఎందుకు తీసికెల్లవు?" ఏడుస్తూనే అంది.

నాగేసర్రావు నెమ్మదిగా చెప్పాడు — "నా మాట మర్చిపో. నేనూ, ఉంకో పిల్లా ప్రేమించుకున్నాం. రేపో మాపో పెళ్ళి చేసుకుంటాం. నిన్ను తీసికెళ్ళి ఏ గంగలో దింపమంటావు?" అన్నాడు కొంచెం వెటకారంగా.

సీతాలు దిమ్మెరపోయి నించుంది.

"ఎళ్ళింక, ఎవరన్నా సూస్తారు. ఆ రోజులన్నీ మర్చిపో. సుబ్బరంగా వుండు ఆడితో."

"సుబ్బరంగానో, పెబ్బరంగానో బతుకుతాన్లె. సావను. ఎప్పుడన్నా ఈ ముండమాట తలుపుకి తెచ్చుకో!" అనేసి చరచరా వెళ్ళిపోయింది రోడ్డు మీదికి.

చింతచెట్టు నీడలోకి తప్పుకున్న కొండయ్య సీతాల్ని కొంతదూరం నడవనిచ్చి పెద్దపులిలాగ మీద పడ్డాడు, చెంపలు వాయించాడు. జుట్టు పీకాడు. గుద్దు లేశాడు. కాళ్ళా సేతులా కుమ్మాడు. బూతులు తిట్టి "ఇదంటే నీ యవ్వారం? సెప్పు ఆడికాడ కెందు కెల్లావో సెప్పు" అని నిలదీశాడు.

సీతాలు బిక్క చచ్చిపోయింది. ఏడవటం మర్చి పోయింది. "ఆణ్ణోసారి సూద్దామని ...." అంది.

"అంతేనా? ఆణ్ణి తీసికెళ్ళిపొమ్మని అడగలేదా? నా మొకం సూడనని సెప్పలేదా? మాట్లాడవేం? అన్నీ ఇన్నాను. సీ! సిగ్గుమాలిందానా! సెడబుట్టావే తల్లి కడుపున, పో! ఎక్కడికి పోతావో పో! సిగ్గుమాలిందానా! సెడబుట్టావే తల్లి కడుపున, పో! ఎవడితో లెగిసి పోతావో పో! ఇంటికి రాకు. నీ మొకం సూపించకు" అని రౌద్రంగా వెళ్ళిపోయాడు కొండయ్య.

సీతాలు చాలాసేపు చింతచెట్టు కింద చీకట్లోనే నించుంది. చెర్లోపడి చచ్చి అందరిమీదా కసితీర్చు కొమ్మని మనసు రెచ్చగొట్టింది చాలాసేపు.

ఊరు బద్దకంలో పడి నిద్దరపోతోంది. ఇళ్ళ మీదా, వాకిళ్ళ మీదా చెరువు మీదా, చేల మీదా .... వెన్నెల విరగకాస్తోంది.

ఆ సాయంత్రం వేళ ఊళ్ళోకి ఉప్పు బండి తోలు కొచ్చిన ఆసామీ చాకిరేవొడ్డున, బండివిప్పి ఎడ్లని కట్టేసి, తిండి తిని గడ్డిలో పడుకున్నాడు. "ఏయ్! ఎవరా మడిసి?" అని కేకపెట్టాడు దూరంగా తెల్లచీర మనిషిని చూసి.

ఉలుకూ పలుకూ లేదు.

గబగబా లేచి దగ్గరికి వెళ్ళాడు. "ఎవర్నువ్వు?"

చెరువు గట్టున నించున్న సీతాలు తప్పు చేసిం దానిలాగ అంది. "నేను సాకలోళ్ళ పిల్లని — వూరికే వొచ్చాను" ఆ రెండు మాటలకే కంఠం గజగజ వొణికింది.

బండి మనిషి వెటకారంగా నవ్వాడు. "ఇలాంటేల లెగిసొచ్చినావు. తెల్లకోకా అదీ కట్టుకున్నావు. పూలెట్టు కున్నావు. బితుకు బితుకుగా మాట్లాడతన్నావు ఎవణ్ణన్నా పేమించినా వేంటి? వత్తానని సెప్పి మాయ సేశాడా?"

బిత్తరపోయింది సీతాలు.

బండి మనిషి సీతాలు మీదికి జరిగి మొహంలో మొహం పెట్టాడు. "ఏం టాలోసిత్తన్నావు? ఆడింక రాడు. నా కాడికి రా! రూపాయిత్తాను! బయం లేదులే. ఎవ్వరూ లేరు" అని కావలించుకున్నాడు.

సీతాలుకి భయమేసి విడిపించుకోబోయింది. బండి మనిషి, పట్టు వదల్లేదు. ఉత్సాహంగా నవ్వుతూ, "ఎవణ్ణి పేమించినా వొకటేనే పిల్లా! రూపాయెట్టి సినేమా కెల్దుగాని" అంటూ బలవంతంగా సీతాల్ని బండి వెనక్కి లాక్కుపోయాడు.

["జయశ్రీ" మాసపత్రికలో. 1965 ప్రాంతాల్లో కావచ్చు] ★